అనుగృహం ఎప్పుడు?

- టిడ్కో ఇళ్ల కోసం పేదలు ఎదురు చూపులు
- అధికారం చేపట్టి ఏడాది దాటినా నోరు మెదపని కూటమి ప్రభుత్వం
- కట్టిన ఇళ్లు సైతం పనిరాకుండా పోతాయని లబ్ధిదారుల ఆవేదన
- రూ.50 వేలు చొప్పున కట్టి ఎనిమిదేళ్లు


పోణంగి రోడ్డులో టిడ్కో ఇళ్లు నిర్మిస్తున్న బ్లాకులు


నిర్మాణం ఆగిపోవడంతో మొండిగా దర్శనమిస్తున్న బ్లాకులు

ఏలూరు (టూటౌన్): పట్టణంలోని పేద ప్రజలు ప్రభుత్వ అను'గృహం'కోసం ఎదురుచూస్తున్నారు. అధికారంలోకి రాగానే టిడ్కో ఇళ్లను పంపిణీ చేసేస్తామంటూ ఉత్తరకుమార ప్రగల్భాలు పలికిన కూటమి నాయకులు అధికారం చేపట్టి ఏడాది దాటినా దాన్ని నెరవేర్చకపోవడంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని సైతం నెరవేర్చకపోవడంపై లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేసే పనులుకు చెప్పే వాటికి వాస్తవ పరిస్థితులు చాలా దూరంగా ఉన్నాయంటూ టిడ్కో లబ్ధిదారులు దుమ్మెత్తి పోస్తున్నారు. ప్రచార ఆర్భాటమే తప్ప క్షేత్ర స్థాయిలో తమలాంటి నిరుపేదలకు ఒనగూరే ప్రయోజనం ఏమీ లేదు అంటూ లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తొలివిడత 2,208 లబ్ధిదారుల గుర్తింపు

ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో టిడ్కో ఇళ్ల కోసం 2018లో మొత్తం 6,480 మంది పేద, మధ్యతరగతి ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. పరిశీలన అనంతరం వచ్చిన దరఖాస్తుల్లో 4,272 మందిని అనర్హులుగా లెక్క తేల్చి పక్కన పెట్టేశారు. మిగిలిన 2,208 మందిని టిడ్కో ఇళ్లను పొందేందుకు అర్హులుగా నాటి అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో నగరంలోని ఆయా డివిజన్లలోని కార్పొరేటర్లు తమ చేతివాటం ప్రదర్శించారు. తమకు తాయిలాలు ఇచ్చిన వారికే టిడ్కో ఇళ్ల కేటాయింపు జరిగే విధంగా చక్రం తిప్పారనే విమర్శలూ ఉన్నాయి. ఎంపికై న లబ్ధిదారులు రూ.50 వేలు చొప్పున తమ వాటా సొమ్ముగాను చెల్లించారు. బ్యాంకు వడ్డీ లెక్క కట్టినా తాము చెల్లించిన మొత్తం రెట్టింపయ్యిందని నేటికీ తమకు ఇళ్లు చేతికి అందలేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

పోణంగి రోడ్డులో నిర్మాణం

ఏలూరు నగరపాలక సంస్థలో గుర్తించిన టిడ్కో లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం నిమిత్తం పోణంగి రోడ్డులో మొత్తం 60 ఎకరాలను భూసేకరణ చేశారు. ఆ ప్రాంతంలో ఒక్కో బ్లాకుకు 48 ప్లాట్స్ చొప్పున మొత్తం 100 బ్లాకులులో 4,800 ప్లాట్లు నిర్మించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నారు. తొలి విడతలో అర్హులుగా గుర్తించిన లబ్ధిదారులకు అందించేందుకు 40 బ్లాకుల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. వీటిలో ఇప్పటి వరకు 20 ఫ్లాట్లు మాత్రమే నివాసయోగ్యంగా నిర్మించారు. మరో 20 ఫ్లాట్లు 80 శాతం మేర పూర్తి చేశారు. మిగతా వన్నీ వివిధ స్టేజ్‌లలో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టిడ్కో ఇళ్ల నిర్మాణంపై ఇప్పటి వరకు కనీస చర్యలు తీసుకోకపోవడంతో అవి ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్న చందంగా టిడ్కో ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయి.

టిడ్కో ఇళ్ల నిర్మాణాలపై దృష్టి సారించాలి



రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణాలపై దృష్టి సారించాలి. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు పూర్తి అయిన ప్లాట్‌లను తక్షణం అప్పగించాలి. ఎన్నికలకు ముందు టిడ్కో ఇళ్లు అధికారంలోకి వచ్చిన వెంటనే అప్పగిస్తామంటూ చెప్పిన టీడీపీ అధికారం చేపట్టి యేడాది దాటినా ఇంత వరకూ నోరు మెదపకపోవడం దారుణం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించే ఏర్పాట్లు చేయాలి.

– బండి వెంకటేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ మిషన్ కార్యదర్శి,ఏలూరు

ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి



ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలి. లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లను తక్షణం అందజేయాలి. ఎన్నో ఏళ్ల నుంచి ఏలూరు నగరంలోని వేలాది మంది అర్హులైన లబ్ధిదారులు టిడ్కో ఇళ్ల కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది కాబట్టి వెంటనే వాటిని లబ్ధిదారులకు అందజేస్తారని భావించిన పేదలకు నిరాశే ఎదురైంది.

– డీఎస్‌వీడీ ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి, సీఐటీయూ, ఏలూరు

క్లుప్తంగా

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సత్కారం


ఉపాధ్యాయయులను సత్కరిస్తున్న ఎంపీడీఓ

దెందులూరు: మెరుగైన సమాజం లక్ష్యంగా ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులు ఆదర్శనీయులని, వారి కృషి సేవ గుర్తింపు పొందుతాయని ఏలూరు రూరల్ ఎంపీడీఓ వి.శ్రీలత అన్నారు. ఆదివారం ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తేరా ప్రసాద్, జిల్లా స్థాయిలో అవార్డు పొందిన 9 మంది ఉపాధ్యాయులు కుమారి, కృష్ణవేణి, విజయ, పద్మలత, రమాదేవి, జోసఫ్ తంబి, కనకదుర్గ, స్వర్ణలత, వరలక్ష్మిలను ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించి అభినందించారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలి


జయప్రకాష్‌తో ఎస్సీ సెల్ జిల్లా సెక్రటరీ కిషోర్, గంధం మహేష్, మోహనచంద్ర

ఏలూరు టౌన్: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీను క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు నిత్యం కృషి చేయాలని ఆ పార్టీ ఏలూరు సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్ అన్నారు. ఇటీవల నూతనంగా ఏలూరు నియోజకవర్గంలోని పార్టీ నేతలకు జిల్లా పదవులు కేటాయింపులు చేసిన నేపథ్యంలో ఆదివారం వారు సమన్వయకర్త జేపీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, ఘనంగా సత్కరించారు. జయప్రకాష్‌ని కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపల్లి పరమేశ్వరరావు, సూరిశెట్టి ఉదయభాస్కర్, ఎస్సీసెల్ ఏలూరు జిల్లా సెక్రటరీ మందపాటి కిషోర్‌ప్రసాద్, యువజన విభాగం ఏలూరు జిల్లా ఈసీ సభ్యులు గంధం మహేష్ (బాబి), లీగల్ సెల్ ఏలూరు జిల్లా ఈసీ సభ్యుడు కడిమి మోహనచంద్ర తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం కోక్కిరాయిలంక, పైడి చింతపాడు గ్రామాల్లో సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. వార్షిక మరమ్మతుల నిమిత్తం విద్యుత్తు సరఫరా నిలిపేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు


సేంద్రియ ఎరువుల తయారీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఏలూరు రూరల్: ప్రకృతి సేద్యంతో రైతులకు మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయశాఖ డీపీఎం వెంకటేష్ అన్నారు. ఆదివారం వ్యవసాయాధికారులు ఏలూరు పరిసర ప్రాంతం పోణంగిలో రైతులకు ప్రకృతి సేద్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పరిస్థితుల్లో రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారిస్తే సాగు పెట్టుబడి తగ్గుతుందన్నారు. పురుగుమందులు, ఎరువుల వాడకం తగ్గించడం వల్ల ఆరోగ్యకరమైన ఆహారం ఉత్పత్తి చేయవచ్చన్నారు. అనంతరం రైతులతో కలిసి వేపగింజలు, పుల్లిటి మజ్జిగ, బెల్లం ద్రావణం, అరటిపండ్ల జ్యూస్‌తో వరి చేలపై తెగుళ్ల నివారణకు ద్రావణ తయారీపై అవగాహన కల్పించారు. తర్వాత రైతులు మారపు శంకర్, పుడే సింహాచలం, సాయన సర్వయ్యకు చెందిన 16 ఎకరాల వరిచేలపై డ్రోన్ ద్వారా పిచికారీ చేయించారు.

దళితులపై దాడులు దుర్మార్గం

దెందులూరు: కూటమి ప్రభుత్వంలో దళితులపై దాడులు రోజురోజుకు అధికమవుతున్నాయని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ఏలూరు జిల్లా అధ్యక్షులు తేరా ఆనంద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏలూరు రూరల్ మండలం మానూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కైకలూరు నియోజకవర్గం దానగూడెం గ్రామంలో పట్టపగలు దళితులపై జనసేన కార్యకర్తలు దాడి దేనికి సంకేతం? అని ప్రశ్నించారు. ఎక్కడైనా సమస్య ఉంటే చర్చలు పెద్దల ద్వారా పరిష్కరించుకోవాలి తప్ప భౌతిక దాడులు, దౌర్జన్యాలు చేస్తే ప్రజాస్వామ్యానికి అర్థమేమి ఉంటుందన్నారు. ఇంత జరుగుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, హోంమంత్రి స్పందించకపోవడం బాధాకరమన్నారు. దళితులపై జరిగిన దాడిని రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సుధాకర్ రావు వర్కింగ్ ప్రెసిడెంట్ కనకారావులకు, పార్టీఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావులకు వివరించామన్నారు. స్పందించిన జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు ఏలూరు నియోజకవర్గ కన్వీనర్ జయప్రకాష్ నాయకులు ఏలూరు వైద్యశాలలో బాధితులను పరామర్శించారన్నారు. దాడికి గురైన దళిత బాధితులకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందన్నారు. దాడి చేసిన జనసేన కార్యకర్తలను అరెస్టు చేయకపోతే భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రకటిస్తామని హెచ్చరించారు.


తేరా ఆనంద్

మాల మహానాడు మద్దతు

జనసేన కార్యకర్తలు చేతిలో దాడికి గురైన దళితులకు ఏలూరు జిల్లా మాల మహానాడు అధ్యక్షులు గొల్ల కిరణ్ ఆదివారం మద్దతు ప్రకటించారు. జిల్లా కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులకు న్యాయం జరిగేం తవరకు అండగా ఉంటామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

జయప్రకాష్ పరామర్శ


అప్పలనరసమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ ఏలూరు నగర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు వేగి బాలాజీ తల్లి వేగి అప్పలనరసమ్మ ఆదివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఏలూరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్ ఆమె పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్‌గురునాథ్, మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి గాజుల బాజీ తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న సంగీత పోటీలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో నిర్వహించిన సంగీత పోటీలు ప్రేక్షకులకు ఆకట్టుకున్నాయి. తొలుత అకాడమీ డైరెక్టర్ ఎస్‌పీఎస్ వాసు మాట్లాడుతూ ఏలూరు పరిసర ప్రాంతాల్లోని ఎందరో కళాకారులకు వివిధ గాత్ర, వాద్య పరికరాలపై శిక్షణ అందించి వారిని తీర్చిదిద్ది సంగీత రంగానికి అందిస్తున్నామన్నారు. గత 23 సంవత్సరాలుగా సంగీత కళా సేవ నిర్వహిస్తూ నైపుణ్యం ఉండి అవకాశాలు లభించక మరుగున పడిపోతున్న సంగీత కళాకారులకు అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. తమ సంస్థ ద్వారా పాడనా తీయగా అనే పాటల పోటీల కార్యక్రమం నిర్వహిస్తూ వారిలోని ప్రతిభను వెలికి తీస్తున్నామన్నారు. ఆదివారం నిర్వహించిన పోటీల్లో విజేతల వివరాలను ప్రకటించారు. జూనియర్స్ విభాగంలో వై.నాగ సంహిత, ఎల్.శాశ్విత్, జి.ఆద్య శ్రీనిధి వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచారు. అలాగే సీనియర్స్ విభాగంలో ఎం.నిరీష ప్రథమ, ఎం.సాయి శ్రీలాస్య ద్వితీయ, సీహెచ్ రాజేష్ తృతీయ స్థానాల్లో నిలిచారు. ఈ పోటీల్లో పాల్గొని విజేతలు కాలేకపోయిన వారి నుంచి మంచి గాత్రం కలిగిన వారిని ఎంపిక చేసి పాడనా తీయగా సీజన్-3లో అవకాశం కల్పిస్తామని కార్యక్రమ కన్వీనర్ వహీదా వాసు తెలిపారు. కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్న ఆలపాటి నాగేశ్వరరావు, పెదపాటి రామకృష్ణ, ఫాదర్ టి.ఇమ్మానియేలు, లంకా వెంకటేశ్వర్లు, ఎస్‌వెల్ సీఈఓ ప్రభాకర్, పాలిమేర హరికృష్ణ, వై.అర్జునరావు చేతుల మీదుగా విజేతలకు నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు.


పోటీల్లో విజేతలను అభినందిస్తున్న అతిథులు

2012 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వాలి

ఉంగుటూరు: 2012లో డీఎస్సీలో ప్రభావితమైన 461 మంది అభ్యర్థులకు న్యాయం చేయాలని వారికి ఉద్యోగాలు ఇవ్వాలని టీటర్స్ ఎమ్మెల్సీ గోపిమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం ఉంగుటూరు మండలం వచ్చిన ఆయన మాట్లాడుతూ డీఎస్సీలో అప్పటిలో సెలక్ట్ అయి కూడా లోకల్, నాన్ లోకల్ విషయంలో అన్యాయం జరిగిన అభ్యర్థులకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు.

రేపు మూడు ప్రాంతాల్లో అన్నదాత పోరు


వాసిరెడ్డి మధుసూధనరావు

ఏలూరు టౌన్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 15 నెలల కాలంలో రాష్ట్రం రైతన్నలు దుర్భరమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నారని, రైతులకు భరోసా లేకుండా పోయిందని వైఎస్సార్ సీపీ రైతు విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు వాసిరెడ్డి మధుసూధనరావు మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో రైతులకు అండగా నిలిచేందుకు, రైతుల పక్షాన పోరాటం చేసేందుకు వైఎస్సార్‌సీపీ అన్నదాత పోరు కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ఈనెల 9న ఏలూరు జిల్లాలో మూడు చోట్ల రైతు పోరు కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నిర్ణయించామని తెలిపారు. ఏలూరు జిల్లా అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు నాయకత్వంలో జిల్లా వ్యాప్తంగా ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడులో రైతు పోరు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పోలవరం, చింతలపూడి నియోజకవర్గాలకు సంబంధించి జంగారెడ్డిగూడెం ఆర్‌డీఓ కార్యాలయం వద్ద అన్నదాత పోరు నిర్వహిస్తామన్నారు. పోలవరం సమన్వయకర్త తెల్లం బాలరాజు, చింతలపూడి సమన్వయకర్త కంభం విజయరాజు, పార్టీ రాష్ట్రస్థాయి నేతలు, జిల్లా నేతలు, కార్యకర్తలు రైతులతో కలిసి భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

'అన్నదాత పోరు'ను విజయవంతం చేయాలి

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో వ్యవసాయాన్ని పండుగ చేస్తే నేటి కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు రైతులను దగా చేస్తున్నారని వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్ అన్నారు. ఏలూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అన్నదాత పోరు పోస్టర్లను పార్టీ నేతలతో కలిసి ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు నాయకత్వంలో ఏలూరులో చేపట్టే అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ నేతలు, క్యాడర్‌తో పాటు, రైతన్నలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు, కైకలూరు నియోజకవర్గాలకు సంబంధించి రైతులతో అన్నదాత పోరు కార్యక్రమం చేపడతామన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు జరిగే అన్యాయంపై పోరాటం చేయాలని వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. బ్లాక్ మార్కెట్‌లో యూరియా విచ్చలవిడిగా దొరుకుతుంటే మార్క్‌ఫెడ్‌లో మాత్రం యూరియా అందుబాటులో లేకపోవటం ప్రభుత్వ డొల్లతనానికి నిదర్శనమని మండిపడ్డారు. ఓ వైపు రైతులు ఎరువుల కోసం బారులుతీరి నిలబడి వేచి చూస్తూ...రోజుల తరబడి తిరిగాల్సి వస్తుందని చెబుతూ ఉంటే... సీఎం చంద్రబాబు మాత్రం సన్నాయి నొక్కులు నొక్కడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో ఏలూరు నగర అధ్యక్షులు గుడిదేశి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్‌బాబు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమరాడ స్రవంతి, వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఘంటా మోహనరావు, రాష్ట్ర కార్యదర్శి దాసరి రమేష్, నగర మహిళ అధ్యక్షురాలు జిజ్జువరపు విజయనిర్మల, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు చిలకపాటి డింపుల్‌జాబ్, నగర ఎస్సీ సెల్ అధ్యక్షులు ఇనపనూరి జగదీష్, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ల నాగవెంటక బాచి, జిల్లా కార్యదర్శి తులసీ, మేధావుల విభాగం అధ్యక్షుడు యేసు పాదం తదితరులు పాల్గొన్నారు.



అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తోన్న సమన్వయకర్త జయప్రకాష్, నగర అధ్యక్షులు శ్రీనివాస్

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	40	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	48	బీర్లచిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	38	చామదుంపలు	36
బెండకాయలు	20	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	48	కంద	00
కాకర కాయలు	34	బీట్‌రూట్	38
బీరకాయలు	30	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	36	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	70-90
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	40	పాలకూర	10
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	18	చుక్కకూర	10
గోరుచిక్కుడు	36	గోంగూర	07-10
దోసకాయలు	20-26	పుదీనా	05
ఆనబకాయ (1)	20-30	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	27
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	43
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	10
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	14
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	29
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	28
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	21
ఏలూరు - తిరుపతి	16.00	4830	32

దూరవిద్యను సద్వినియోగం చేసుకోవాలి


దూర విద్యపై అవగాహన ప్రదర్శన చేస్తున్న ఎంఈవోలు, ఉపాధ్యాయులు

గణపవరం: చదువు మధ్యలో ఆపేసిన వారు చదువుకోవడానికి దూరవిద్య ఉపయోగపడుతుందని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవోలు ఎం.రాజేష్, జి.బాలయ్య అన్నారు. ఆదివారం గణపవరంలో సార్వత్రిక విద్యాపీఠం ద్వారా నిర్వహించబడుతున్న దూరవిద్యపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పలు విధ వృత్తులు, ప్రైవేట్ పనులు చేసుకుంటూ తమ చదువును కొనసాగించడానికి దూరవిద్య ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ పాఠశాల హెచ్‌ఎం వీరవేణి, నంబర్-1 ఆదర్శ పాఠశాల హెచ్‌ఎం ఎంఎస్‌ఎల్‌ఎస్ నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చంద్రగ్రహణంతో ఆలయాల మూసివేత

భీమడోలు: సంపూర్ణ చంద్ర గ్రహణం నేపథ్యంలో ఆదివారం సాయంత్రం నుంచి ప్రముఖ దేవాలయాలను మూసి వేశారు. ఆదివారం రాత్రి నుంచి తెల్లవారు జాము వరకు చంద్ర గ్రహణ ప్రభావం ఉండడంతో ఆలయాలకు తాళాలు వేశారు. గృహాల్లోని వారు ఈ గ్రహణం పట్ల జాగ్రత్తలు పాటించాలని జ్యోతిష్యులు చెబుతున్నారు. భీమడోలు జంక్షన్‌లోని ద్వారకాతిరుమల దేవస్థానానికి చెందిన రూపక దేవాలయాన్ని మూసివేశారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల, అంబర్‌పేట, పోలసానిపల్లి, ఎంఎం పురం, కొల్లేరు గ్రామాల్లోని ఆలయాల్లో ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నుంచి వాటిని మూసివేశారు. సోమవారం సంప్రోక్షణ పూజలుచేసి ఆలయాలను తిరిగి తెరవనున్నారు.

పెదపాడులో..

పెదపాడు: మండలంలోని పలు దేవాలయాల్లో చంద్ర గ్రహణం సందర్భంగా ఆలయాలను మూసి వేశారు. ఆదివారం సాయంత్రం చంద్ర గ్రహణం పురస్కరించుకుని ఆలయాలను మూసి వేశారు. మండలంలోని దేవాలయాలను సోమవారం ఉదయం మరలా ఆలయశుద్ధి చేసిన అనంతరం ఆలయాలను తెరవనున్నట్లు చెప్పారు. ఆహార పదార్థాలు నిల్వ ఉంచే వాటిలో దర్భలుగాని, గరికగాని ఉంచాలని ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు సూచించారు.


భీమడోలు: మూసి వేసిన రూపక దేవాలయం


పెదపాడు: అభయాంజనేయ స్వామి ఆలయం

కాపు విద్యా ట్రస్ట్ ఏర్పాటుకు చర్యలు

ద్వారకాతిరుమల: స్థానిక కాపు కల్యాణ మండప ట్రస్ట్‌కు అనుబంధంగా విద్యా ట్రస్ట్ ఏర్పాటు చేయాలని పాలకవర్గ మండలి నిర్ణయించింది. కాపు కల్యాణ మండపంలో ట్రస్ట్ ఛైర్మన్ పుప్పాల వాసుబాబు అధ్యక్షతన ఆదివారం ట్రస్ట్‌బోర్డు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణ మండప అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను చర్చించి, ఆమోదించారు. అందులో భాగంగా విద్యా ట్రస్ట్ కమిటీ ఏర్పాటుకు, అలాగే ఏసీల మరమ్మతులు, నూతన ఏసీల కొనుగోలుకు ఆమోదముద్ర వేశారు. పొలసానిపల్లి హైవే బ్రిడ్జి వద్ద నుంచి ద్వారకాతిరుమల క్షేత్రం వరకు కాపు కల్యాణ మండప సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కాపు కల్యాణ మండప వర్కింగ్ ప్రెసిడెంట్ చినిమిల్లి వెంకటరాయుడు, వైస్ ఛైర్మన్ పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, కార్యదర్శి పల్నాటి శివరామ్ ప్రసాద్(బుజ్జి), ట్రెజరర్ మాకా శ్రీనివాసరావు, స్థలదాత పెద్దిరెడ్డి వేణుగోపాల కృష్ణారావు, సభ్యులు చుండూరి వెంకట్రావు, పాశం రామాంజనేయులు, వంగా రఘు, నూకల రామకృష్ణ తదితరులున్నారు.